మరమ్మతు మరిచారు..



ఇటీవల వర్షాలకు ధ్వంసమైన కనపర్తి-వీణవంక రోడ్డు

- ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు
- ప్రమాదకరంగా మారిన కనపర్తి–వీణవంక రహదారి
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం
- ఇబ్బంది పడుతున్న రైతులు, వాహనదారులు

వీణవంక: మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 54 వేల జనాభా ఉండగా 18 వేల కుటుంబాలు ఉన్నాయి.

➔ కనపర్తి–వీణవంక గ్రామాల మధ్య పై ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అరకిలోమీటర్ దూరం రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డు తెగిపోవడంతో కొద్ది రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. తాత్కాలిక మరమ్మతు చేయగా ద్విచక్రవాహనాలు మాత్రమే దారి గుండా వెళ్తున్నాయి. కనపర్తి, బేతిగల్ గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి ఈ దారి గుండా వెళ్తుంటారు.

➔ రోడ్డుకు ఇరువైపులా నాలుగు మీటర్ల లోతు రోడ్డు తెగిపోవడంతో రైతులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. ఇటీవల సర్పంచ్ పర్లపల్లి రమేశ్‌తో పాటు కొంత మంది గ్రామస్తులు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు.

➔ బేతిగల్–కనపర్తి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు కూడా వర్షాలకు దెబ్బతింది. రైతులు పొలాలకు వెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. రోడ్డు తెగిపోవడానికి ఎగువన ఉన్న చెరువులే ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు. బేతిగల్ శివారులోని ఊర చెరువు నుంచి భారీ వరద దిగువనకు ప్రవహించడంతో ఫ్లైఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో రోడ్డు ధ్వంసమైంది.

➔ జమ్మికుంటకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై కల్వల నుంచి జమ్మికుంటకు వెళ్తుండగా కనపర్తి వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి పడిపోయారు. త్రుటిలో ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారు.



పక్క ఫొటోలో కనిపిస్తున్న కల్వర్టు మండలంలోని మలన్నపల్లి–ఘన్ముక్కుల గ్రామాల పరిధిలో ఉంది. గతంలో కురిసిన వర్షాలకు ధ్వంసం కావడంతో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆదేశాలతో పీఏసీఎస్ డైరెక్టర్ కట్కూరి మధుసూదన్‌రెడ్డి సొంత డబ్బులతో తాత్కాలిక మరమ్మతు చేయించాడు. మళ్లీ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ దారి గుండా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి కోతలు ప్రారంభంకావడంతో ధాన్యం తరలించడం ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఇదీ ఈ ఒక్క మల్లన్నపల్లి పరిస్థితి కాదు. మండలంలోని కొన్ని గ్రామాల్లోని రహదారుల దుస్థితి ఇలానే ఉంది. అకాల వర్షాలతో రోడ్లు ధ్వంసం కావడంతో ప్రయాణికుల తిప్పలు అన్నీ ఇన్నీ కావు.

ఇబ్బంది పడుతున్నారు



ఇటీవల కురిసిన వర్షాలకు కనపర్తి, బేతిగల్, మల్లన్నపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. కనపర్తి–వీణవంక గ్రామాల మధ్య రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్రవాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈవిషయంపై అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఇప్పటికైనా స్పందించి మరమ్మతు చేయించాలి.

– చింతల శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

➔ ఘన్ముక్కుల నుంచి కారులో కొందరు మల్లన్నపల్లికి వస్తుండగా కల్వర్టు వద్ద గుంతలో దిగబడటంతో కారు కింది భాగం ధ్వంసమైంది. రూ.నలభై వేలు ఖర్చయినట్లు బాధితులు వాపోయారు. నిత్యం ఏదో ఒక సంఘటన జరుగుతుందని, మరో వారంలో పూర్తిస్థాయిలో వరికోతలు ప్రారంభంకానున్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు త్వరగా మరమ్మతు పనులు చేయించాలని ప్రయాణికులు రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నియామకం



గన్నేరువరం: యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మర్రి వెంకటమల్లు నియామకమయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణయాదవ్ కరీంనగర్‌లో అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, జీఎంపీఎస్ ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, మండలం అధ్యక్షుడు ప్రశాంత్ యాదవ్, గౌరవాధ్యక్షుడు బాలయ్య, ఉపాధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ యాదవ్, సర్పంచ్ మల్లయ్య, గంగాధర మండల అధ్యక్షుడు ఐలయ్య, సంఘం సభ్యులు, నాయకులు రామస్వామి, రాములు, మోహన్, మహేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయంలో ‘శ్రీచక్ర ప్రతిష్ఠాపన’

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేటలో శ్రీ మానసాదేవి ఆలయంలో శ్రీ చక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గోపూజ, విఘ్నేశ్వర పూజ, రక్షాబంధన యాగశాల ప్రవేశం, అఖండ జ్యోతి ప్రజ్వలన, శ్రీ చక్ర యాంత్రపూజలను ఆలయ అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ గౌరవాధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, ఎంపీటీసీ స్వప్న, ఉపసర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ



సైదాపూర్: మండలంలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ఆసరి సమ్మయ్య, దుగ్గం వీరయ్య ప్రమాదంలో గాయపడగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్, రాఘవులు, క్రాంతికుమార్, మేకల రవీందర్, చాడ కొండాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

‘ఈటలను విమర్శిస్తే సహించం’



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: బీజేపీని వీడి ఈటల రాజేందర్‌పై తప్పుగా ప్రచారం చేస్తే సహించేది లేదని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాచపల్లి వెంకటేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని అమరుల స్థూపం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు పార్టీ వీడి ఇతర పార్టీలకు వెళ్లారని, ఈటలను విమర్శించడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు రాచపల్లి ప్రశాంత్, శనిగరపు రవికుమార్, అఖిల్, మధుయాదవ్, మల్లికార్జున్, అహ్మద్‌పాషా, రాజేశ్, పరశురాం గౌడ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

జమ్మికుంట: పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడిగా పూదరి విజయ్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సర్వాయి పాపన్న గీత పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్ గౌడ్, కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు పల్లెర్ల కొంరయ్య, శ్రీనివాస్‌గౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఫోర్‌లైన్ పనులు ప్రారంభం



శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులో బుధవారం ఫోర్‌లైన్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కరీంనగర్–వరంగల్ వరకు కేంద్రం నిధులతో బైపాస్, ఫోర్‌లైన్ రోడ్డు పనులు జరుగుతున్నాయి.

పచ్చిమిర్చి సాగుతో అధిక లాభాలు



బాపురెడ్డిని సన్మానిస్తున్న రైతులు

చొప్పదండి: సాంప్రదాయ పంటలకు భిన్నంగా డిమాండ్ ఉన్న పంటలు సాగుచేస్తే అధిక లాభాలు సాధించవచ్చని హైబ్రిడ్ సీడ్ కంపెనీ నీ రీజనల్ మేనేజర్ కట్ల శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన గుర్రం బాపురెడ్డి అనే రైతు రెండెకరాల్లో పచ్చిమిర్చి సాగుచేసి అధిక లాభాలను సాధించగా మండలంలోని రైతులు గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా బాపురెడ్డి మిర్చి సాగుచేసి లాభాలు పొందిన విధానాన్ని రైతులకు వివరించారు. అనంతరం రైతులు బాపురెడ్డిని ఘనంగా సన్మానించారు. లింగమూర్తి, చందు, నాలుగు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

మాతృభాషతో విద్యా ప్రమాణాలు మెరుగు

జమ్మికుంట: మాతృభాషతో విద్యా ప్రమాణాలు మెరుగవుతాయని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శిశు మందిరాలు నెలకొల్పి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం స్వర్ణజ్యోతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతి శిశు ఇంగ్లిష్ మీడియం కోసం దాతల సాయంతో నిర్మించిన స్వర్ణజ్యోతి భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు సాంబయ్య, విద్యాపీఠ రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, శీలం శ్రీనివాస్, సమితి అధ్యక్ష, కార్యదర్శి అవాల రాజారెడ్డి, అకుల రాజేందర్, గర్రెపల్లి అరుణ్‌కుమార్, సురేందర్‌రాజు, రవీందర్, ప్రధానాచార్యులు సుదర్శన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని ఆర్నకొండ, రాగంపేటతోపాటు పలు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో స్థానికేతరులు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. కార్యక్రమంలో రవీందర్, సౌజన్య, చుక్కరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, లత, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు



బతుకమ్మ వేడుకల్లో మహిళా న్యాయవాదులు

తిమ్మాపూర్: మండలంలోని వాగేశ్వరి, జ్యోతిష్మతి, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణలో వేడుకలకు హాజరై ఆడిపాడారు. చైర్మన్లు జువ్వాడి సాగర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేదే బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు, ప్రిన్సిపాల్ శరత్‌బాబు, సబిత, కనకయ్య, లక్ష్మణ్‌కుమార్, రాజేశం, మనోహర్, రాజేందర్ రెడ్డి, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

కోర్టు ఆవరణలో..

హుజూరాబాద్ : పట్టణంలోని కోర్టు భవనాల సముదాయ ఆవరణలో బతుకమ్మ సంబరాలు జరిగాయి. సబ్ కోర్టు సముదాయ ఆవరణలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా సిబ్బంది కుటుంబ సభ్యులు బతుకమ్మ ఆడారు. అందంగా పేర్చిన అలంకరించిన బతుకమ్మలకు సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు భగవాన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, న్యాయవాదులు, , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు



మండపంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



జమ్మికుంట : అన్నదానం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

చొప్పదండి: పట్టణంలోని రామాలయ వీధిలోని దుర్గాదేవి మండపంలో అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ప్రత్యేక పూజలు చేశారు. మాతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, యుగేందర్, జహీరొద్దీన్, చందన్ కుమార్, శ్రీరాం, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: గోపాల్‌రావుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద నవయుగ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పూజారి సత్యనారాయణాచార్యులు కుంకుమ పూజలు నిర్వహించారు. క్లబ్ సభ్యులు ఆనందరెడ్డి, శివ, కర్ణాకర్, మల్లేశం, భాస్కర్ రెడ్డి, కపిల్, దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ నార్ల రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం..

జమ్మికుంట: దుర్గామాత శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలో హౌజింగ్ బోర్డు కాలనీ, మారుతీ నగర్‌లో పంచముఖ హనుమాన్ ఆలయంలో నాలుగో రోజు అమ్మవారి మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపత్, కౌన్సిలర్ శ్రీలత, ఆలయ చైర్మన్ మల్లయ్య, అవినాష్, భక్తులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలకేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. మహిళలు కుంకుపూజలు నిర్వహించారు. శివాలయంలో అర్చకులు శ్రీ శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఒకటో వార్డు సభ్యుడు పన్యాల నాగిరెడ్డి, కమిటీ సభ్యులు శ్రీకాంత్, గూడెం చంద్రశేఖర్, సాయిచరణ్, సింగాపురం శివ మణిరాజ్, కోనేటి అంజనీప్రసాద్, బైరి శ్రీనివాస్, శశి, ఆదిత్య, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలకేంద్రంలో అన్నపూర్ణదేవి శాకాంబరీదేవి అవతారంలో దుర్గామాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నేడు మండపం వద్ద అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కట్టంగూర్ రాంస్వరణ్‌రెడ్డి, దుర్గాస్వాములు కౌశిక్, సాయికుమార్, హరీశ్, దుర్గాప్రసాద్, విజయబాబు, రమేశ్, నరేశ్, రాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం సందర్శన

గంగాధర: ఐదురోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని గ్రూప్ ఏ అధికారులు బుధవారం గ్రామస్థాయి అధికారుల పని తీరును పరిశీలించారు. గ్రామంలోని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేజ్‌సోషల్ మ్యాప్‌ను పరిశీలించారు. సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కాసారపు శైలజ శ్రీకాంత్, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, ఐకెపీ మహిళా సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పాడి కౌశిక్‌రెడ్డితో నాయకులు

వీణవంక : మండలంలోని పోతిరెడ్డిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు దులం శ్రీనివాస్ బీజేపీకి రాజీనామా చేసి, హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, మండల గౌడ సంఘం నాయకులు తిరుపతి, సతీశ్ గౌడ్, మధు, మహేశ్, నారాయణ, రాజమల్లు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న సంపతి ఉదయ్

గన్నేరువరం: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వైఎస్సార్ తెలంగాణ పార్టీ అభ్యర్థిగా టికెట్ కోసం మండలంలోని మాదాపూర్‌కు చెందిన ఆ పార్టీ నాయకుడు సంపతి ఉదయ్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ అధికార ప్రతినిధి పిట్ట రామ్‌రెడ్డికి దరఖాస్తు అందజేశారు. తనకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

ప్రజలకు బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు



గ్యారంటీ కార్డులు అందజేసున్న పొన్నం ప్రభాకర్



గ్యారంటీ కార్డులతో నాయకులు

చిగురుమామిడి: మండలకేంద్రంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. బుధవారం ఉదయం రైతులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, వాకర్స్‌తో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాపై వివరించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు అండగా ఉండి ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డులను బుధవారం మండలంలోని ఖాదర్‌గూడెంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా పంపిణీ చేశారు. పార్టీ గతంలో చేపట్టిన పథకాలు, అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి గురించి ఇంటింటా తిరుగుతూ వివరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చంటి చంద్రయ్య, శ్రీనివాస్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని పార్టీ మానకొండూర్ నియోజవర్గ అభ్యర్థి, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, మండలంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నియోజవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టనున్న పథకాలను వివరించారు. గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్ గ్రామాలకు చెందిన వంద మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, పెంచాల రాజయ్య, పొంద్రాల కనుకరాజేశం, బాకారపు సమ్మయ్య, కనుకం కుమార్, సాయిరి దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా



రంగారావుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బొడిగె శోభ

గంగాధర: మండలంలోని రంగారావుపల్లి, తాడిజర్రి గ్రామాల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేశానన్నారు. మరోసారి అవకాశం ఇస్తే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గన్నేరువరం: మండలంలోని చాకలివానిపల్లె గ్రామానికి చెందిన రేపాక తిరుపతి కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం ఇబ్బంది పడుతుండగా చొక్కారావుపల్లె ఉపసర్పంచ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి బుధవారం తిరుపతిని పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఇక్కడ చొక్కారావుపల్లె సర్పంచ్ ముస్కు కరుణాకర్‌రెడ్డి, మహేందర్, బామండ్ల విద్యాసాగర్, బామండ్ల శంకర్, ఉదయ్, కృష్ణకుమార్ ఉన్నారు.

‘బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం’

గన్నేరువరం: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. మండలకేంద్రం పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు పోల్సాని సుగుణాకర్‌రావు, బాస సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు గుండ్లపల్లి నుంచి మండలకేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. మండలంలోని ప్రధాన రహదారుల నిర్మాణాలను విస్మరించారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జోగిరెడ్డి, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు గడ్డం సుమిత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు జాలి శ్రీనివాస్ రెడ్డి, మునిగంటి సత్తయ్య, ప్రధాన కార్యదర్శులు వీరగోని వెంకటేశ్, తాళ్లపల్లి పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.